
# చూపులు కలిసిన శుభవేళ



పి. యింద్రరేఖ

తనక్కావలసిన పుస్తకంకోసం వెదకి...ఆ రాక్‌లో కన్పించక పోయేసరికి యింకో రాక్‌లో చూసుకునేందుకు యివతలికి రాబోతున్న ఆమె... ఎదురుగా...గబగబా వస్తున్న బూట్ కాళ్ళను చూసి అటువైపుగా కదిలింది. దారి యివ్వాలనే వుద్దేశ్యంతో.

ఏదో రిఫరెన్స్ వెదుక్కునేందుకు వచ్చిన అతను చీరకుచ్చిళ్ళ మృదుకదలికను చూసి ప్రక్కకు తొలిగాడు.

యిద్దరి వుదేశ్యాలు ఒకటే కావడంతో, యిద్దరి పాదాలు ఒకేవైపు అభిముఖంగా కదిలాయి.

విసుగ్గా తల ఎత్తింది ఆమె. అసహనంగా ఆగిపోయాడు అతను.

ఒక్క క్షణం యిద్దరిచూపులు కలుసుకున్నాయి. "ఎక్స్‌క్యూజ్ మీ" అతని పెదాలు నెమ్మదిగా కదిలాయి.

సున్నాలా చుట్టివుంచిన ఆమె పెదాలు విడివడ్డాయి...కొంచెంగా.

అటు వైపుగావెళ్ళి నిలుచున్నాడు అతను. త్వర త్వరగ్గానే అయినా వయ్యారంగా నడిచి వెళ్ళిపోయింది ఆమె.

తను వెదుకుతున్న పుస్తకం కనిపించాక ... పేజీలు తిప్పుతూ...అప్పటికప్పుడే ఏదో చదివేస్తున్న ఆమె కళ్ళు...కదిలి వెళ్ళిపోతున్న బూట్ల చప్పుడుకు గభాలున ఆగిపోయాయి.

*   *

లైటార్పి...కనులుమూసుకోబోతున్న ఆమెకా నిశ్శబ్దంలో.. లయగా ... తీవిగా ... పడుతున్న బూట్ల చప్పుడు విన్పించింది.

'జోలపాటలా...పడుకోబోతున్న సమయంలో జ్ఞాపకం వచ్చిందేమిటి " నవ్వుకుందామె ... బరువుగా రెప్పలు వాలిపోతుంటే.

*   *   *

తనక్కావలసిన పాయింట్స్...ఎదురుగావున్న పుస్తకంలో చూసి నోట్ చేసుకుంటున్న అతను... కిటికీ చువ్వలగుండా లోపలికి తొంగిచూస్తున్న పూలతీగె గాలికి చిరుగా కదలడం చూసి ... అప్రయత్నంగా ఆగిపోయాడు-పెన్‌ను పెదాల కానించుకుంటూ ... అలసటగా మూసుకున్న కనులముందు...పాదాలను కప్పిన ... లేత నీలి రంగు చీర బార్డర్ సుతారంగా కదలడం... మెదిలింది

చూపులు కలిసిన ఒక్క క్షణంలో కనిపించిన ముఖం లీలగా దోబూచు లాడింది.

"దారిలో ఎదురైన అపరిచిత... యింకా కళ్ళముందు మెదలడం ... విచిత్రంగా వుంది." అతనికి మరేం వ్రాయబుద్ధికాలేదు పెన్‌కాప్ మూసేసి బెడ్‌వైపుగా నడిచాడు.

*   *

మూడు సార్లు ప్రదక్షిణం చేసి ధ్వజస్థంభం దగ్గరగా వస్తున్న ఆమె .. గులాబీ పువ్వులు పట్టుకుని లోపలికి వెళుతున్న అతను - అప్రయత్నంగానే ఆగిపోయారు.

ఇద్దరూ గుడిలోపలికి వెళ్ళే ప్రయత్నంలోనే వున్నారు ఎవరి పాదాలు .. ముందు కదలాలో తెలియని అయోమయంలో, ఐదారు క్షణాలు నవ్వుకుంటూ వెళ్ళిపోయాయి

చివరికి అతనే... గులాబీ పూవులలో చిక్కుకున్న చూపులను విడదీసుకునే ప్రయత్నం చేయకుండా నెమ్మదిగా లోపలికి వెళ్ళిపోయాడు.

కాస్సేపటికి తలవంచుకుని నడిచింది ఆమె.

యిద్దరిచూపులు .. గర్భగుడిలోకి దేవుడి విగ్రహంపైనే కేంద్రీకరించినా, మనసు భక్తి వైపు మొగ్గడం లే దెంతసేపటికీ.

పూలు, కుంకుమ. హారతి పళ్ళెంలో పట్టుకుని వచ్చిన పూజారి, యాంత్రికంగా తన పని తాను నెరవేర్చుకు పోయాడు.

వాల్చిన కను రెప్పలు పైకి ఎత్తటానికి సాహసం కూడగట్టుకోలేని ఆమె హఠాత్తుగా కళ్ళు పెద్దవి చేసి చూసింది, ఆమె చేతిలో కొంటెగా ఎర్రగా నవ్వుతోంది గులాబీ "స్వామికి అతను సమర్పించినగులాబీపూవు ." ఓరగా అతని వైపు చూసిందామె. అంతసేపు ఆమెనే చూస్తూ వుండిన అతని కళ్ళు చటుక్కున మరో వైపుకి తిరిగిపోయాయి.

కుంకుమ నొసట దిద్దుకుని చేతిలో వున్న గులాబీ పూవును భక్తితో కళ్ళకు తాకించుకుని, జడలో తురుముకుందామె

అతని మనసెందుకో ఓలాటి సంతృప్తిని అను

భవించింది.

బయటికి వచ్చి యిసుకలో మౌనంగా ఒంటరిగాకూర్చుందామె. గుడిలోంచి వెళ్ళిపోయేముందు కాసేపు కూచుని వెళ్ళాలనే ఆచారా న్ననుసరిస్తూ.

ఆమెకు దూరంగా గుడి చుట్టూ కట్టిన ప్రహరీ గోడను ఆనుకుని, మసక వెన్నెలలో కనీ కన్పించకుండా దాగుడుమూత లాడుతున్న ప్రకృతిని చూస్తూ నిలబడ్డాడు అతను.

వెళ్ళిపోదాం అనుకుంటూ లేచి నిలబడింది.

వాచ్ చూసుకుని వెనక్కు తిరిగాడు అతను.

ఇద్దరూ గుడి బయటకు వచ్చేశారు. చెరో వైపుగా నడిచాయి పాదాలు.

కొంత దూరం నడిచాక వెనక్కి తిరిగి చూసిందామె. అప్పుడే అతనూ తల వెనక్కి తిప్పాడు.

కంగారుగా కళ్ళు కిందికి వాల్చేసుకుని అటు వైపుగా తిరిగిపోయింది.

సన్నని పెదాలమీద వాలబోతున్న చిరునవ్వును ఆపడం చేతకాలేదతనికి.

* * *

"ఛీ! వెధవబస్ ... ఎంతకీ రాదు" తిట్టుకుంటూ మరోసారి రోడ్ వైపు దృష్టి సారించిన ఆమె కనులు అతన్ని త్వరగా గుర్తు పట్టేశాయి.

ఫ్రెండ్‌తో మాట్లాడుతూ వస్తున్న అతను... ఆమె దగ్గరగా వచ్చాకగానీ గమనించలేదు. ఇంత సేపూ ఆమెను చూడనీయకుండా కబుర్లలో ముంచేసిన ఫ్రెండ్‌ని మనసులో తిట్టుకున్నాడు.

ఆమెకు విన్పించేలా నెమ్మదిగా "రేపు సాయంత్రం శాంథోమ్‌కి..." కదిలాయి అతని పెదాలు.

తల వంచుకుని పెదవి కొరుక్కుంటూ నిలబడ్డ ఆమె వులికిపడి తలెత్తింది.

"ఏవిట్రా మధూ అంటున్నావ్!" ఫ్రెండ్ అతని భుజంపట్టి కుదిపాడు.

"ఉహుఁ! నిన్నుకాదులే" ఎటోచూడాలని ప్రయత్నించి సాధ్యంకాక ఆమెవైపుచూస్తూ సమాధానం చెప్పాడు మధు.

కంగారుగా చుట్టూ కలయ చూసిందామె. మరెవ్వరూ లేరు ఆ చుట్టుప్రక్కల. ఆమెను రక్షించేందుకులా...బస్‌వచ్చి ఆగింది. గబ గబావెళ్ళి ఆబస్ ఎక్కేసింది. స్థిమితంగా కూచున్నాక...కర్చీఫ్‌తో బుగ్గలు అద్దుకుంటూ..."మధు...మధు" అనుకుంది.

* * *

నవల చదువుతూ, టైంపీస్‌వంకచూసిందామె. మూడు కావస్తోంది.

"సాయంత్రం కావడానికి యిక ఎంతోసేపు లేదు' అనుకుంటుంటే. గుండెలు దడ దడా కొట్టుకున్నాయి.

నిన్న అతనలా గుస గుసగా అన్న క్షణంనించీ మొదలైన ఆలోచన ఎంతకీ తెగడం లేదు.

"ఎంత సాహసం!" కోపంతో పెదవి కొరుక్కుంది.

"అంతమంచిగా కన్పించిన అతనేనా అలా పలికింది" ఆశ్చర్యపోయిందో క్షణం.

"అయినా తనని రమ్మనడంలో అతనివుద్దేశ్యం ..." అర్థం కాని అయోమయంలో మునిగిపోయింది.

"వెళ్ళడమా? మానడమా?' చివరికి ఈప్రశ్నే మిగులుతోంది

"వెళ్ళనందువల్ల నష్టమేంలేదు. వెళ్ళకపోతేనే లేనిపోని ఆలోచనలు..." చేతిలో వున్న నవలను టేబిల్ మీదికి గిరవాటేసి బాత్‌రూమ్‌వైపు నడిచింది. బీరువా తెరచి... చీర తీయబోతుంటే ... చీర మడతల మధ్య వడిలిన గులాబీ రేకులు తొంగి చూశాయి.

"ఈ పువ్వును ఎందుకు దాచుకున్నాను? పట్టి పిచ్చి...కాదుకాదు...మరేమిటి?..." నవ్వేసింది చిలిపిగా...ఎదురుగావున్న అద్దంలోని ప్రతిబింబం.

నాలుకతో... వెక్కిరించేసి ... చేతికందిన చీరను గబగబా కట్టేసుకుంది.

చేతిలో పుస్తకంతో...బస్‌స్టాప్‌వైపునడిచింది.

బీచ్ దగ్గర పడుతుంటే ఆమె కెందుకో భయంగా అన్పించింది. చిరు చెమటలు కమ్ముతున్న ఒంటికి సముద్రం గాలి తాకుతుంటే హాయిగా వుంది.

బస్సుదిగి చుట్టూ కలియచూసింది కొంచెం దూరంలో అతను. ఉహుఁ! కాదు మధు! అరచేతికి పట్టిన చెమటతో పుస్తకంకొద్దికొద్దిగా తడుస్తోంది.

ఆమె వైపుగా రెండడుగులువేసి ఆగిపోయాడు అతను.

నెమ్మదిగా బీచ్‌వైపుగా నడిచింది ఆమె.

అతను ముందు నడుస్తున్నాడు.

యిసుకలో ఎంతోదూరం నడవటం విసుగ్గా వుందామెకు. "ఎందుకు రమ్మన్నట్లో" కోపంగా అనుకుంది.

"థాంక్ గాడ్! ఎందుకలా పిలిచాను అ క్షణంలో నన్నేదయ్యం పట్టుకుంది అని మథన పడ్డాను నిన్నటినుంచీ. నా మాట మన్నించి రావడంలో ఆమెకు నా మీద వున్న గౌరవం తెలుస్తోంది. కాని అంతటి గౌరవానికి అర్హుడనా నేను? ఇప్పుడామెఆమాటే అడిగేస్తే రమ్మనడంలో ఏమిటి నీ వుద్దేశ్యం అని నిలదీస్తే ఏమని సమాధానం చెప్పాలి?..." ఆలోచనలతో నడుస్తూ వున్న అతను... తనవెనుక ఆమె లేదు అనే విషయం లీలగా తెలిసి గబుక్కున ఆగిపోయి... వెనక్కు తిరిగి చూశాడు.

యిసుకలో కూచుని మోకాళ్ళమీద గడ్డం ఆన్చుకు అతనివైపే చూస్తున్న ఆమె చూపులు మరల్చుకుంది.

వెనక్కు తిరిగి ఆమెకు కొంచెం దూరంలో కూర్చున్నాడు.

"అబ్బ! ఏం మాట్లాడదేమిటి? ఏమను కోవాలి యితని గురించి" విసుగ్గా చేతిలో వున్న నవల తెరిచింది.

"ఏం మాట్లాడాలి ఎలా మొదలెట్టాలి?' నెర్వస్‌గా ఫీలవుతూ... యిసుకలో వేళ్ళు కదుపుతూ వుండిపోయాడు.

"హల్లో సుధా! ఒంటరిగా కూర్చున్నావేం? ఓఁ... పుస్తకం వుందా తోడుగా. బీచ్‌కొచ్చినా చదువేనా, నువ్వేం మనిషివే బాబూ."

"మాలా నువ్వా. కూర్చో." వులికిపడి తలెత్తిన ఆమె, స్నేహితురాలిని పలకరించింది.

"సారీ. కూర్చోవడానికి టైం లేదు. యిక్కడికి వచ్చిన కాసేపటికి నేను మర్చిపోయిన ముఖ్య విషయం ఒకటి గుర్తుకు వచ్చింది. అందుకే వెళ్ళిపోతున్నాను. అది సరే. శనివారం వెళ్దామను కున్న పిక్చర్ ప్రోగ్రాం మర్చిపోలేదుగా నీవు."

"నీకున్నంత మతిమరుపు లేదులే," నవ్వింది దామె. "కానీ టికెట్స్ దొరకడమే ప్రాబ్లమ్‌గా వుంది. మా అన్నయ్య మూడ్ యివ్వాళ అంత బావోలేదు. రేపు బతిమాలాడి టికెట్స్ రిజర్వ్‌చేసి పెట్టమని. ఆ విషయం నేను చూసుకుంటాలే. నువ్వెళ్ళిక. మళ్ళీ మర్చిపోగలవు ఈ గొడవలో పడి!" మాలను సాగనంపేసింది.

ఆమె చూపులు దూరంగా కూర్చున్న అతని వైపు మళ్ళీ తిరగకముందే-

"ఏ పిక్చర్‌కు వెళ్ళాలను కున్నారు?" మాట్లాడెందుకు టాపిక్ దొరికాక గొంతు పెగుల్చుకున్నాడు అతను.

తలయెత్తి అతనివైపు చూసింది.

"మిమ్మల్నే" నెమ్మదిగా అన్నాడు.

"విన్నాను" అన్నట్లు కనురెప్పలు కొద్దిగా కదిలించి..."క్లియోపాత్రాకి" అంది.

"మీ కభ్యంతరం లేకపోతే టికెట్స్ నేనుతెచ్చి పెడతాను. శనివారం మీరు, మీఫ్రెండ్‌థియేటర్‌కు వచ్చేయండి మామూలుగా. అక్కడే మీకుటికెట్స్ యిచ్చేసి వెళ్ళిపోతాను."

"థాంక్స్! మీరు చూడరా ఆ పిక్చర్‌ని..." అడిగింది.

"నే నిదివరకే చూశాను."

"అలాగా "

ఆ తర్వాత వాళ్ళిద్దరిమధ్య మరేం మాటలు నడవలేదు. వాడాని కిద్దరిమనసులు ఏవో మాట్లాడాలని తహతహ లాడ్తూనేవున్నాయి.

"ఇక వెళ్తాను" కాసేపటికి లేచి నిలబడింది.

"సోమెనీ థాంక్స్!" అనుసరించాడామెను.

"ఎందుకో?" అడగాలని కదిలిన పెదవులు ఆగిపోయాయి.

* * *

"మీ రొక్కరే వచ్చారేం? మీఫ్రెండ్ ఏరీ?" సుధను అడిగాడు మధు.

"తను డైరెక్టుగా థియేటర్‌కే వచ్చేస్తానని ఫోన్ చేసింది" వాచ్ చూసుకుంటూ సమాధానం చెప్పింది సుధ.

"మీరే ఆలస్యంగా వచ్చారు. ఇప్పుడు ఆమె కోసం వెయిట్ చేయాలా?"

"ఔను. అదే ఆలోచిస్తున్నాను. యింకా రాలేదేమిటా అని. న్యూస్‌రీల్ కూడా అయిపో వస్తున్నట్టుంది. ఇక రాదేమో! మీరు చాలా కష్టపడి టికెట్స్ తెచ్చారు. కానీ పిక్చర్ చూసే అదృష్టం మాకు లేనట్టుంది." డిసప్పాయింట్ అయిపోయినట్లు ఆమె గొంతు నీరసంగా పలికింది.

"పోనీ . మనిద్దరం వెళ్దాం" ఎలాగో యీ మాటలు అనేసి చూపులు మరోవైపు మరల్చు

కున్నాడు.

మౌనంగా ఆలోచిస్తూ వుండిపోయింది, కాసే పటికి "సరే పదండి" గబగబా లోపలికి నడిచింది.

... ... ...

"నేనేనా యిలా పరాయి మగాడితో ... అమ్మ వాళ్ళకు తెలియకుండా పిక్చర్ చూస్తోంది;" ఆశ్చర్యపోతోంది ఆమె....

"యిలాటి అవకాశం కోసమే నేను ఎదురు చూస్తున్నానని...అది యిలా కలిసి వచ్చేసరికి ముందు వెనకలాలోచించకుండా ఆమెను రమ్మ న్నానని అనుకోవడం లేదు కదా..." బరువుగా అయిపోతున్న తలను నొక్కుకోవాలని అన్పి స్తున్నా...ప్రక్కనే కూర్చున్న సుధ ఏమనుకుం టుందోనని మానేశాడు అతను.

"రమ్మనగానే సరేననేసిన నా సాహసాన్ని యితను ఎలా అర్థం చేసుకున్నాడో... చులకనై పోయి వుంటాను బాగా... యిలాటివి కొత్తేమి కాదేమోనని చీప్‌గా వూహించుకుంటున్నా డేమో నాగురించి... ఛ...ఛ..." సిగ్గుతో కూర్చోలేక పోతోంది.

"భగవాన్ ! యిటువంటి పరిస్థితి పగవాళ్ళకు కూడా వద్దు ..." బాధగా అనుకున్నాడతను.

ఆలోచనలతో సతమత మైపోతున్న ఆ యిద్దరి కళ్ళకు 'ఇంటర్‌వల్' అనే అక్షరాలు మాత్రం కన్పించాయి.

లైట్లు వెలగగానే గబుక్కున లేచినిలబడ్డాడు మధు.

బయటకు పోబోతూ..." "కూల్ డ్రింక్ తీసుకువస్తాను" అన్నాడు. "వద్దు వద్దు..." తల వంచుకునే త్వర త్వరగా అనేసింది.

"సరే..." వెళ్ళి పోయాడతను.

రిలీఫ్‌గా ఫీలయింది ఆమె.

* * *

"త్వరగా పదసుధా ! అతను నీతో ప్రత్యే కంగా ఏదో మాట్లాడాలట." పెళ్ళి చూపులకని వచ్చిన వాళ్ళతో కుటుంబ విషయాలు మాట్లాడ్డం ముగిశాక... లోపలికి వచ్చి కూతుర్ని త్వర పెట్టింది తల్లి.

"వస్తున్నానమ్మా" లేచి నిలబడిన సుధ కళ్ళ ముందు మధురూపం ఆఖరు సారిగా మెరిసిమాయ మయిపోయింది.

కుర్చీలో కూర్చున్న అతనికి ఆమె చీర కుచ్చెళ్ళు నెమ్మదిగా కదుల్తూ తన దగ్గరగా రావడం కన్పించింది.

"సుధ సుధ" పలవరించబోతున్న పెదవులను నొక్కిపట్టి తల యెత్తాడు.

అప్పుడే కనురెప్పలు పైకి ఎత్తి చూసింది సుధ.

"మీరా ?" యిద్దరి కన్నులు ఒక్కసారి వెలి గాయి.

సిగ్గుతో అవమానంతో కళ్ళు వాల్చేసింది ఆమె.

"ఆ రోజు యింటర్వెల్ తర్వాత అతనితో చెప్పకుండా వచ్చేసిన నన్ను ఎన్ని తిట్టుకుని వుంటాడో. "మర్యాద తెలియని మనిషి"-నన్ను చూడగానే అతని కన్నులలో కదిలిన భావం యిదే కదూ ! మీ అమ్మాయిని చేసుకోను అని చెప్పే స్తాడా. కారణం అడిగితే- పరాయి మగాడితో పెళ్ళి కాకముందే సినిమా చూడ్డానికి తయారయిన మీ అమ్మాయిని బుద్ధివున్న మగాడెవడూ చేసు కోడు అని తెగేసి చెప్పేస్తాడు" కళ్ళనీళ్ళొక్కటే తక్కువగ వుంది ఆమె పరిస్థితి.

"నన్ను మీరు క్షమించాలి సుధా" ఎండి పోతున్న పెదాలు విడదీసుకుని నెమ్మదిగా తప్పు చేసిన వాడిలా మొదలు పెడుతున్న అతనితో చూపులు కలిపే శక్తి లేకపోయింది ఆమెకు.

"థాంక్ గాడ్ ! నిన్ను చేసుకోను అని నాతోనే చెప్పి వెళ్ళిపోతాడేమో. అందుకనే యిలా ప్రత్యే కంగా నాతో మాట్లాడాలని అడిగాడులావుంది. కాని


జాతీయ అంతర్జాతీయ రాజకీయ
అవగాహనకు....
వారం వారం
"ఆంధ్రవాణి"
చదవండి.


కాని...అమ్మకు ఏంచెప్పాలి ?"

"ఆ పిక్చర్ చూడ్డం యిక వీలవదేమోనని... మీరు బాగా డిసప్పాయింట్ అయిపోవడంచూసి. మిమ్మల్ని రమ్మని పిల్చేనేగానీ, నా గురించి మీరెంత తక్కువగా వూహించు కుంటున్నారో ఆలోచించేకొద్దీ...నాకసలు ఓ క్షణంకూడా కూచో బుద్ధికాలేదు. మీకు 'రాను' అని ఖచ్చితంగా చెప్ప డం రాదని ఆరోజు బీచ్ కి వచ్చినప్పుడే తెలిసి పోయింది. అందుకే ఆ పిక్చర్‌కు మొహమాటం కొద్దీ వచ్చారు. కానీ నా ప్రక్కన ముళ్ళమీద కూచున్నట్లుగా ఫీలవుతున్నారని తెలుసుకోలేనంత మూర్ఖుణ్ణికాను. ఏం చేయాలో అర్థంకాలేదు. నేను ప్రక్కన లేకపోతే మీరు ఫ్రీగా ఆ పిక్చర్ చూస్తారనే వుద్దేశ్యంతో...ఇంటర్వెల్ అవగానే అట్నుంచటు మీకు చెప్పకుండా వెళ్ళిపోయాను. నా కోసం చూసి ... చివరికి వుట్టి మోస గాడు అనుకున్నారుకదూ...ప్లీజ్ నన్ను కొంచెం అర్థం చేసుకోండి... మొదటిసారిగా మిమ్మల్ని చూసిన తర్వాత మరోసారి కన్పిస్తే బావుణ్ణను కున్నాను. తర్వాతసారి మీరు కన్పించినపుడు దేవతే కరుణించినంత సంబరపడి పోయాను. సుధా...మీరంటే నా కెందుకంత ఆరాధన ఏర్ప డిందో నాకే తెలియదు. ఆవేళంలో నన్ను నేనే మరిచిపోయిన క్షణాలలో చేసిన తప్పులకు ... నన్ను చీప్‌గా అంచనా వేసి... కాదనకండి ..." ఇంకా ఏవేవో చెబుతున్న అతని వేపే కలగంటున్న అనుభూతితో చూస్తున్న సుధ...చివరికి నెమ్మదిగా అంది. "నన్నుకూడా మీరు క్షమించాలి. ఆ రోజు మీరటు వెళ్ళగానే నేను యింటికి వచ్చేశాను. ఏదో తప్పు చేస్తున్నట్లు అన్పించిన భావన నన్ను నిలువనీయలేదు".

ఈసారి ఆశ్చర్య పోవడం మధువంతైంది.

"శ్రావణందాకానా పంతులు గారూ... ఇంకా దగ్గరలో ఏవైనా ముహూర్తా లున్నాయేమో చూడండి..." బయట వరండాలోనుంచి విన్పిం చిన మాటలు ఆమె బుగ్గలను ఎరుపెక్కించాయి. అరమోడ్పు కన్నులతో చూశాడతను ఆ అందాన్ని.

★

